క్లుప్తంగా

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీలో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ లోగా iti.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8న నిర్వహించనున్న వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలియజేశారు. ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 9న ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 91773 91289 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పేద కుటుంబానికి సరకుల వితరణ


మహిళకు సరకులు అందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి బీసీ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి అగనంపూడి లయన్స్‌క్లబ్ సహకారంతో నిత్యావసర సరకులు అందించారు. యార్లగడ్డ నాగ దుర్గా ప్రసాద్ (మెడికల్ నాగేశ్వరరావు) తన తల్లి వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా ఓ కుటుంబానికి 25 కేజీల బియ్యం, కంది పప్పు, నూనె, పంచదార, ఇతర సరకులు అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్లు గుడే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతురావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

'స్పందన' పురస్కారం అందజేత


పురస్కారం అందుకుంటున్న సత్యనారాయణ

అగనంపూడి: స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అగనంపూడికి చెందిన ప్రజా సంఘం నాయకుడు బలిరెడ్డి సత్యనారాయణకు ఉత్తమ గురు పురస్కారం అందించారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.కృష్ణమోహన్ ఈ పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ శ్యామ్ రెడ్డి మాట్లాడుతూ సమాజ హితం కోసం కార్యక్రమాలు చేస్తున్న సామాజిక కార్యకర్తలను ప్రోత్సహించేందుకు పురస్కారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నేషనల్ కన్జూమర్స్ రైట్స్ కమిషన్ చైర్మన్ రామానుజస్వామి, కిషోర్, కృష్ణారావు, చంద్రికారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన బాక్సర్లకు సత్కారం


క్రీడాకారులను సత్కరిస్తున్న చినతల్లి తదితరులు

గాజువాక : ఈ నెల 25 నుంచి వచ్చే నెల 9 వరకు గోవాలో నిర్వహించనున్న జాతీయ బాక్సింగ్ పోటీలకు గాజువాక ప్రాంతానికి చెందిన ప్రభుదాస్, చంద్రమౌళి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 67వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా చినతల్లి తదితరులు వారిని ఘనంగా సత్కరించారు. గాజువాక ప్రాంతానికి చెందిన బాక్సర్లు జాతీయ పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. జాతీయ స్థాయిలోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, నాయకులు పల్లా పెంటారావు, ప్రసాదుల శంకరరావు, బుల్లెట్ శ్రీను, పల్లా మనోజ్, ప్రసాదుల చంటి, పల్లా రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'ఆరోగ్య సురక్ష'

- 69వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం
- 1150 మందికి వైద్య పరీక్షలు, మందుల పంపిణీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద రద్దీ

అక్కిరెడ్డిపాలెం: పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 69వ వార్డు తుంగ్లాం చుక్కవానిపాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. వైద్య సేవల కోసం 69, 70వ వార్డులకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి అనంతరం సభలో మాట్లాడారు. పేదల ఆరోగ్యం కోసం దివంగత ముఖ్యమంత్రి ఆరోగ్యశ్రీ, 108, 104 వంటి ఎన్నో కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంతకు మించి పేదలకు సేవలు అందించేందుకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వారికి కూడా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే చెందుతుందన్నారు. విద్య, వైద్య రంగాల్లో సంస్కరణలు, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు, ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు, పేదలకు సొంతిళ్లు .. ఇలా ఎన్నో విప్లవాత్మక మార్పులతో ప్రజలందరికీ ఆత్మీయుడయ్యారన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. ఇంకా 30 సంవత్సరాలు జగనే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రూ.17కోట్ల వ్యయంతో అగనంపూడిలో 100 పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తెస్తున్నామన్నారు. 69, 70 వార్డుల పరిధిలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేశారని తెలిపారు. 1150 మందికి షుగర్, బీపీ, కంటి పరీక్షలతో పాటు ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వారికి టోకెన్లు అందజేశారన్నారు. జీవీఎంసీ 69వ వార్డులో కాపుతుంగ్లాం 1,2, రెడ్డి తుంగ్లాం, చుక్కవానిపాలెం, తోకాడ సచివాలయాల పరిధి, 70వ వార్డులో చట్టివానిపాలెం, ఎల్‌బీఎస్ నగర్, ఎల్.వి. నగర్ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహించామని వైద్య సిబ్బంది తెలిపారు.

10 మంది వైద్యులు హాజరు

శిబిరంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎ.వెంకటరమణ, జనరల్ సర్జన్లు సందీప్, సీహెచ్ రామానుజం, ఈఎన్‌టీ వైద్యుడు నాగరాజు, గైనకాలజిస్ట్ సీహెచ్ దేవాని, కంటి వైద్యుడు బద్రీనారాయణ, లంకెలపాలెం, దువ్వాడ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు దివ్య, పుష్పలత, జనరల్ మెడిసన్ చైతన్య తదితరులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సిబ్బంది మందులు అందజేశారు.


ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న డీఐవో డాక్టర్ జీవన్ రాణి

ఆకట్టుకున్న ఐసీడీఎస్ స్టాల్

శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ ఆకట్టుకుంది. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా మట్టి పాత్రల్లో మిల్లెట్లు, ఇతర పోషకాహార పదార్థాలను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. జోనల్ కమిషనర్ పి.సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్ రెడ్డి, 69, 70 వార్డుల కార్పొరేటర్లు కాకి గోవిందరెడ్డి, ఉరుకూటి చందు, డీఐవో ఎస్.జీవన్ రాణి, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్, నాయకులు ఈగలపాటి యువశ్రీ, కమరున్నీసా బేగం, బోగాది అప్పారావు, బొడ్డా గోవింద్, ధర్మాల శ్రీనివాస రెడ్డి, కాకి అప్పల రెడ్డి, అంగబాబూరావు, సీహెచ్‌ఓ పి.నాగప్పారావు, పలు విభాగాల వైద్యులు పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు



నేను పక్షవాతంతో కొన్ని నెలలుగా మంచానికే పరిమితమయ్యాను. ఆర్థిక పరిస్థితుల కారణంగా పెద్ద ఆస్పత్రుల్లో చూపించుకునే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో వైద్యసిబ్బంది ఇంటికి వచ్చి బీపీ, షుగర్, ఇతర వైద్యపరీక్షలు చేశారు. ఆరోగ్య సురక్ష శిబిరానికి తీసుకువస్తే అందరు డాక్టర్లు ఉంటారని చెప్పి టోకెన్ ఇచ్చారు. వాళ్లు చెప్పినట్లే ఇక్కడ డాక్టర్లు బాగా చూశారు. నెలకు సరిపడా మందులు ఇచ్చారు.

– తుంగ్లాం వాసి

మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరం



నాకు 9ఏళ్ల నుంచి బీపీ, షుగర్. ఎప్పటికప్పుడు షుగర్ టెస్టులు చేయించుకోవడం, ఆస్పత్రిలో డాక్టర్ ఫీజు, మందులు ఇలా నెలనెలా చాలా ఖర్చవుతోంది. ఇటీవల వైద్యసిబ్బంది ఇంటికి వచ్చారు. శిబిరానికి వైద్యనిపుణులు వస్తున్నారని, అన్ని పరీక్షలు చేయించుకోవచ్చని తెలియజేసి టోకెన్ ఇచ్చారు. వైద్యులు పరీక్షించి, మందులు ఇచ్చారు. మాలాంటి వారికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు

– టి.వెంకట రామకృష్ణ, తుంగ్లాం

మంచి వైద్యం అందుతుందనే భరోసా



మా అమ్మాయికి 16 సంవత్సరాలు. మానసిక దివ్యాంగురాలు. మా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో సరైన వైద్యం చేయించలేకపోతున్నాం. ఇక్కడ శిబిరంలో అందరు వైద్యులు ఉంటారు, మంచి వైద్యం లభిస్తుందని వచ్చాను. మా పాపను డాక్టర్లు పరీక్షించారు. మందులు కూడా ఇచ్చారు. మాలాంటి వారికి జగనన్న సురక్ష ఎంతో భరోసా కల్పిస్తుంది.

– రమణమ్మ, చట్టివానిపాలెం

సుందర విశాఖ సీఎం లక్ష్యం

- వార్డుల సమగ్రాభివృద్ధికి చర్యలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 88వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

అక్కిరెడ్డిపాలెం: పరిపాలన రాజధానిగా ఎదుగుతున్న విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అందుకు అనుగుణంగా నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయన్నారు. 88వ వార్డులోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. కాపుజగరాజు పేటలో రూ.40 లక్షల వ్యయంతో ఆర్‌టీసీ కాలనీకి వెళ్లే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి, శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకుందన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

యాదవజగ్గరాజు పేటలో..

కూర్మన్నపాలెం: 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలోని ధోబీ కాలనీలో సుమారు రూ.20లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డుల్లో సమగ్రాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు.

విలీన గ్రామాల్లో వేగవంతంగా పనులు

అగనంపూడి: జీవీఎంసీ విలీన గ్రామాల్లో నాలుగేళ్లుగా అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. 88వ వార్డు దువ్వాడ సమీపంలోని సంధ్యానగర్ అయ్యప్పనగర్‌ల అనుసంధాన రహదారి నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు.


88వ వార్డులో రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, 88వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంధ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్ప నాగరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, సచివాలయ కన్వీనర్ నమ్మి శ్రీనివాస్‌ప్రసాద్, గుంట్ల లక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు దాడి నూకరాజు, శనివాడ రాము, వారాది రాజు, శంకర్, అమరపిని బాబూరావు, జి.గంగా మహేష్, బొడ్డా గోవింద్, ఒ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు లాంగ్ సర్వీస్ అవార్డులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు మంగళవారం లాంగ్ సర్వీసు అవార్డులు అందజేశారు. స్టీల్ ప్లాంట్‌లో 25ఏళ్లు పూర్తి చేసుకున్న ఇద్దరు ఉద్యోగులకు ఆయా విభాగాల్లో ఈ అవార్డులను బహూకరించారు. హెచ్ఆర్ విభాగం ఆధ్వర్యంలో ఏసీఎస్ విభాగం కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఏసీఎస్ విభాగం ఏజీఎం ఈ.భిక్షంకు జీఎం డాక్టర్ వి. చిట్టిబాబు 150 గ్రాముల సిల్వర్ కాయిన్, సర్వీస్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ బి. జోగారావు ఏసీఎస్ అధికారులు ఎం.కె.వి.ఆర్. మోహన్‌రావు, పి. సుధాకరబాబు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

- ఈటీఎల్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో విభాగం మేనేజర్ బి.కె. నాగరాజ నాయక్‌కు విభాగాధిపతి వి.వి.ఎస్.ఎస్. శాస్త్రి చేతుల మీదుగా సిల్వర్ కాయిన్, సర్వీస్ సర్టిఫికెట్ అందజేశారు.


ఉద్యోగికి అవార్డు అందజేస్తున్న జీఎం చిట్టిబాబు, అధికారులు

రోడ్డు విస్తరణతో దశాబ్దాల కల సాకారం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- రూ.7.75 కోట్లతో పనులు

సబ్బవరం: నంగినారపాడు ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష రోడ్డు విస్తరణతో నెరవేరనుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని నంగినారపాడు శివారు కొత్తూరులో రూ.7.75 కోట్ల జీవీఎంసీ నిధులతో విస్తరించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో కలిసి మంత్రి అమర్‌నాథ్ మంగళవారం రాత్రి శంకుస్థాపన చేసారు. ఈ రోడ్డును కొత్తూరు నుంచి నంగినారపాడు హైస్కూల్ వరకూ నాలుగు దశల్లో విస్తరించనున్నట్టు చెప్పారు. కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారని 10 రోజుల్లో పనులు పూర్తిస్థాయిలో ప్రారంభమై యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. రోడ్డు పూర్తయితే పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. పరిసర ప్రాంతాలన్నీ నివాస యోగ్య ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేసినప్పటికీ కరోనా రావడంతో విస్తరణ పనులు నిలిచిపోయాయన్నారు. ఈ రోడ్డు పూర్తి చేసిన తర్వాతే వచ్చి ఓట్లు అడగడం జరుగుతుందన్నారు. మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్‌రెడ్డి విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు భారీ ఎత్తున అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, పార్టీ వార్డు ఇన్‌చార్జి మహలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్ప నాగరాజు, సచివాలయ కన్వీనర్ సర్వసిద్ధి బోరయ్య, నాయకులు బొట్ట ముత్యాలరావు, అప్పలరాజు,చట్టి తాతారావు, మళ్ల నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఉక్కు యువ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ యువ అధికారులందరికీ తగిన న్యాయం జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు అన్నారు. స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ (సీ) ఆధ్వర్యంలో మంగళవారం గాజువాకలో ఏర్పాటు చేసిన ఇంటరాక్షన్ విత్ యంగ్ మేనేజర్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యంగ్ ఎగ్జిక్యూటివ్‌లకు టైమ్ బాండ్ ప్రమోషన్లను వివిధ కారణాలతో ఆర్ఐఎన్ఎల్ ఆపేసిందన్నారు. ఈ విషయంపై ఉక్కు కార్యదర్శితో చర్చించానని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. మిగతా ఎగ్జిక్యూటివ్‌లకు పాత పాలసీ ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలని, ఈ విషయంలోనూ ఆర్ఐఎన్ఎల్ తాత్సారం చేస్తోందన్న విషయాన్ని కార్యదర్శికి తెలిపానన్నారు. ఈ విషయాలన్నింటిపైనా త్వరలోనే కేంద్ర ఉక్కుమంత్రిని కలిసి సమస్య పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, సీ ప్రతినిధులు ప్రసాద్, శ్రీకాంత్, మల్లికార్జునరావు, నాయకులు నాగేశ్వరరావు, శంకరరావు, బాటా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ జీవీఎల్

వైద్య సిబ్బందికి జెడ్సీ అభినందనలు


వైద్య సిబ్బందితో జెడ్సీ సింహాచలం

అక్కిరెడ్డిపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో విశేష సేవలందించిన 69, 70 వార్డుల వైద్య సిబ్బందికి గాజువాక జోనల్ కమిషనర్ అభినందనలు తెలిపారు. తుంగ్లాం యూపీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి రోగులు అధిక సంఖ్యలో వచ్చారు. వారికి ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీల వైద్య సిబ్బంది అంకితభావంతో సేవలు అందించారు. దీంతో జెడ్సీ పి.సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకట రమణ అక్కిరాపు, డాక్టర్ బద్రీనారాయణ, సీహెచ్‌వో నాగ అప్పారావు, డీఐఓ డాక్టర్ జీవన్ రాణి తదితరులు పాల్గొన్నారు.

నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడలో హాల్ట్ కు వినతి

అగనంపూడి: సంబల్‌పూర్ నాందేడ్‌ల మధ్య నడుస్తున్న నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని కోరుతూ దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. గాజువాక పారిశ్రామికవాడలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగరీత్యా వచ్చి స్థిరపడిన వారు లక్షల మంది ఉన్నారని, వీరి సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని దువ్వాడ రైల్వేస్టేషన్‌లో నాగావళి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వాలని వారు కోరారు. ఫార్మాసిటీ, హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి, స్టీల్‌ప్లాంట్, దువ్వాడ వీఎస్ఈజెడ్‌లో శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. నాగావళికి దువ్వాడలో హాల్ట్ ఇవ్వడం వల్ల పారిశ్రామిక ప్రాంత ప్రయాణికులకు అనువుగా ఉంటుందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జాషువా, కె.ఈశ్వర్ ఎంపీకి తెలియజేశారు. రైల్వే బోర్డు అధికారులు, మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీ హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

కూర్మన్నపాలెం: వేలాది మందికి ఉపాధినిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇందుకోసం కార్మికులతో కలసి ఐక్యంగా పోరాడతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 964వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారన్నారు. కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదప్రజల జీవితాలను నాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


964వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

తప్పుడు పత్రాలు సమర్పిస్తే తీవ్ర చర్యలు


సమావేశంలో పాల్గొన్న నాయకులు, బీఎల్‌వోలు


మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక : ఓటర్ల నమోదుకు దరఖాస్తుదారులు తప్పుడు పత్రాలు, తప్పుడు స్టేట్‌మెంట్లు ఇస్తే తీవ్ర చర్యలు ఉంటాయని గాజువాక ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్వో) డి.లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పుడు దరఖాస్తులపై తీసుకోవాల్సిన చర్యలపై ఎన్నికల సంఘం ఇచ్చిన సూచనలను ఈ సందర్భంగా వివరించారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన ఆబ్సెంట్, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లకు బీ నోటీసులను జారీ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 6,141 మంది ఓటర్లకు ఈ నోటీసులను జారీ చేశామని తెలిపారు. ఆ జాబితాను నాయకులకు అందజేశారు. అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటైన పోలింగ్ స్టేషన్ అవసరం లేదని తమ విచారణలో తేలిందని పేర్కొన్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, తహసీల్దార్లు శ్రీవల్లి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు

పరవాడ: పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు సూచించారు. వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ చిరుధాన్యాల ప్రాముఖ్యత, పోషక విలువలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రోజు వారీ ఆహారంగా తప్పని సరిగా చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల సరళిని మార్చుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు విజేత, తులసీమణి మాట్లాడుతూ ఆరు తడి పంటల కింద తక్కువ నీరు తక్కువ పెట్టుబడులతో చిరు ధాన్యాలను సాగు చేయవచ్చునని సూచించారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి పాల్గొన్నారు.

ఘనంగా క్రికెటర్ భరత్ జన్మదినోత్సవం


విద్యార్థులకు భోజనం అనంతరం ఐస్‌క్రీమ్ అందిస్తున్న అంజలి తదితరులు

గాజువాక : భారత క్రికెట్ క్రీడాకారుడు కోన శ్రీకర భరత్ జన్మదినాన్ని గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల మధ్య మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ భార్య నేదునూరి అంజలి, అక్షయపాత్ర ఫౌండేషన్‌తో కలిసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, స్వీట్లు అందజేశారు. అంతకుముందు ఆమె మాట్లాడుతూ భరత్ గాజువాక హైస్కూల్ ప్రాంగణంలోనే క్రికెట్ నేర్చుకోవడం ప్రారంభించారని, ఈ ప్రాంతం నుంచే భారత జట్టులో స్థానం సంపాదించడం హర్షణీయమని అన్నారు. విద్యార్థులు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి, అక్షయ పాత్ర ప్రతినిధులు కామేశ్వరరావు, డాక్టర్ నిష్కించిన భక్తదాస, వి.రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.